క్లుప్తంగా

పులివెందులలో ట్రాఫిక్ మార్పు



ట్రాఫిక్ ఎస్ఐ హాజీవల్లితో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగంగా మెయిన్ బజార్‌లో సెంట్రల్ బోలేవార్డు పనులు సోమవారం నుంచి జరుగుతున్నందున ట్రాఫిక్‌ను మారుస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సంబంధించి ఆదివారం ట్రాఫిక్ ఎస్ఐ హజీవల్లితో చర్చించారు. మెయిన్‌రోడ్డు పడమటి వైపు రోడ్డులో వాహనాలు పోయేలా వన్‌వే చేయడం జరుగుతుందన్నారు. అలాగే శ్రీరామా హాల్‌రోడ్డు వెడల్పు చేస్తుండటంతో ఆరోడ్డున పోయే బస్సులను తాత్కాలికంగా రింగ్‌రోడ్డులో పోయేలా చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సురేంద్రనాథ్, ఏఈలు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

వేంపల్లె : ప్రతి విద్యార్థి క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆయన ఆడుదాం ఆంధ్ర అనే టోర్నమెంట్‌పై విద్యార్థులతో కలిసి అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని అందుకోసం ఏ సహాయ సహకారాలు అయినా అందించేందుకు నేను సిద్ధంగా ఉన్నానన్నారు. క్రీడల్లో మంచి విజయాలను సాధించి వేంపల్లె మండలానికి గొప్ప గుర్తింపు తీసుకరావాలన్నారు. జిల్లాలో ఎక్కడాలేని విధంగా వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో క్రీడా మైదానం ఉందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడలకు సంబంధించి ఆట వస్తువులను సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో క్రీడల ఇన్‌చార్జి రాజశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ తేజంద్ర, ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, పాఠశాల చైర్మన్ గురుప్రసాద్, క్రీడా విద్యార్థులు పాల్గొన్నారు.

సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోండి

లింగాల : పులివెందులలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 5, 7 తేదీలలో సదరం క్యాంపు నిర్వహిస్తున్నారని క్యాంపును వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో ఉన్న వికలాంగులు ఆయా తేదీలలో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అక్కడ వైద్యులచే పరీక్షలు నిర్వహించుకుని సదరం సర్టిఫికెట్లు పొందాలన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు ఆత్మీయ కృతజ్ఞత సభ

చింతకొమ్మదిన్నె : మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో సోమవారం ఆత్మీయ కృతజ్ఞత సభను మూలవంక సమీపంలోని రాజారాణి మహాల్‌లో నిర్వహించనున్నట్లు సీకేదిన్నె జేఏసీ చైర్మన్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లుగా రాణించాలి



సర్టిఫికెట్లు అందుకున్న డ్రైవర్లతో డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపోలో హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూలులో శిక్షణ పొందిన డ్రైవర్లు వృత్తిలో రాణించాలని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. ఆదివారం 16వ బ్యాచ్ శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఇప్పటివరకు కడప డిపోలో 16 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశామని, ప్రస్తుతం 17వ బ్యాచ్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రతిరోజు గంటపాటు వాహనంలోని వివిధ భాగాల పనితీరు, రోడ్లపై ఉండే మార్కింగ్‌లు, రోడ్డు పక్కనగల సైన్‌బోర్డులు, సిగ్నల్స్ గురించి వివరంగా నిపుణులచే శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఇతర వివరాలకు 7382865145 నంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్లు కృష్ణారెడ్డి, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షంతో పొంగిన వాగులు, వంకలు



పెద్దపసుపుల గ్రామం వద్ద చాకలి వంకపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు



కొండాపురం : చీనీ తోటలో నిల్వ ఉన్న వర్షపునీరు

జమ్మలమడుగు : నియోజకవర్గంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్ల వారు జాము వరకు కుండపోత వర్షం కురిసింది. ఎస్.ఉప్పలపాడు గ్రామం వంకలోకి భారీగా నీరు రావడంతో కర్నూల్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అర్బన్ సీఐ సదాశివయ్య రాకపోకలపై ప్రత్యేక నిఘా పెట్టి ఇసుక వంకలో నీరు తగ్గే వరకు రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. పెద్దముడియం మండలంలో 16 సెంటిమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో గుల్లకుంట గ్రామాన్ని వర్షంనీరు పూర్తిస్థాయిలో చుట్టుముట్టాయి. దీంతో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వర్షపునీటిలోనే ట్రాక్టర్‌లో గ్రామంలో తిరిగి ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు ఉన్నతాధికారులకు వివరాలను అందించారు. అత్యధికంగా కొండాపురం 159.2 మిల్లీమీటర్లు, పెద్దముడియం 154, జమ్మలమడుగు 90.4, మైలవరం 105.6, ఎర్రగుంట్ల 59.2, ముద్దనూరులో 81.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పెద్దముడియంలో

పెద్దముడియం : మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 154 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాలకు మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. కుందూ నదికి పైన నుంచి భారీగ వరదనీరు వచ్చి చేరుతుండటంతో నెమళ్లదిన్నె గ్రామం వద్ద ఉన్న వంతెనపై 4 అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. దీంతో నదికి అవతలివైపున ఉన్న గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తన సొంత గ్రామమైన గుండ్లకుంట గ్రామంలోకి వర్షం నీరు భారీగ రావడంతో ట్రాక్టర్‌పై గ్రామంలో పర్యటించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

కొండాపురంలో

కొండాపురం : జిల్లాలోనే అత్యధికంగా శనివారం రాత్రి కొండాపురం మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహించాయి. మండలంలో 159.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇటీవల కొన్ని రోజులుగా ఎండలు తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో తక్కువ వర్షపాతం పడటంతో తక్కువగా పంటలు సాగు చేశారు. కొన్ని చోట్ల పంటలు వరదనీటితో మునిగిపోయ్యాయి.

ముద్దనూరులో

ముద్దనూరు : కడప–తాడిపత్రి జాతీయ రహదారిలో మండలంలోని ఓబుళాపురం వద్ద శనివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో రహదారి కోతకు గురికావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ఆదివారం తెల్లవారుజాము నుంచి సుమారు 6 గంటలపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రహదారి పునరుద్ధరణ అనంతరం మధ్యాహ్నం నుంచి రాకపోకలు సాగాయి. ట్రాఫిక్‌తో సుమారు 5కి.మీ. మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అలాగే మండలంలోని శెట్టివారిపల్లెలోకి వెళ్లే రహదారిలో ఉన్న వంతెన శనివారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షంకు కోతకు గురైంది. దీంతో గ్రామంలోకి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షం కురిసిన ప్రతిసారి వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు తెగిపోతోందని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేంపల్లెలో

వేంపల్లె : పట్టణంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొన్ని ప్రాంతాలలో వర్షపునీరు ఇళ్లలోకి చేరుకున్నాయి. ఆదివారం ఉదయం సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు ఆయా ప్రాంతాలను పరిశీలించి అధికారులతో మాట్లాడి వర్షపు నీరును తొలగించేందుకు చర్యలు చేపట్టారు. పట్టణంలో అభివృద్ధి పనులు జరగడం వలన గండిరోడ్డులోని వైఎస్సార్ గెస్ట్‌హౌస్ వెనుకవైపు ఉన్న భరత్‌నగర్ కాలనీ, ఒకటో వార్డులోని క్రిస్టియన్ కాలనీ, మెయిన్ బజార్, కడప రోడ్డు తదితర ప్రాంతాలలో డ్రైనేజీ వ్యవస్థ బ్లాక్ కావడంతో రోడ్లపైన వర్షపు నీరు వచ్చిచేరిందన్నారు. కొన్ని ప్రాంతాలలో వర్షం నీరు ఇళ్లలోకి చేరాయన్నారు. వెంటనే అధికారులతో మాట్లాడి ఆయా ప్రాంతాలలో నిల్వ ఉన్న వర్షంనీటిని తొలగింపజేశారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వేణుగోపాల్, పంచాయతీ ఈఓ సుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ రమేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఓబుళాపురం వద్ద నిలిచిపోయిన వాహనాలు



కోతకు గురైన శెట్టివారిపల్లె వంతెన అప్రోచ్ రోడ్డు



నిండు కుండలా పెద్దపసుపుల చెరువు



వేంపల్లెలో వర్షంనీటిని పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాసులు

నేడు ఎంపీపీ ఎన్నిక

లింగాల : మండలంలో కాళీగా ఉన్న ఎంపీపీ ఎన్నిక సోమవారం నిర్వహిస్తామని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించి ఎంపీపీని ఎన్నుకోవడం జరగుతుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు తప్పకుండా హాజరుకావాలన్నారు.

కొలువుకు సిద్ధమైన గణనాథులు



పండుగకు సిద్ధమైన వినాయకుడి విగ్రహాలు

ఎర్రగుంట్ల : ఈనెల 18న జరిగే వినాయకచవితి పండుగకు పట్టణంలో భారీగా వినాయకుడి విగ్రహాలు సిద్ధమయ్యాయి. ఇప్పటికే వినాయకుడు కమిటీ నిర్వాహకులు పెద్ద సంఖ్యలో విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. గణనాథుడి కొలువు కోసం చలువ పందిర్లు కోసం కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

భాగవత సప్తాహం ప్రారంభం

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లె వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీ లక్ష్మివెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం భాగవత సప్తాహ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 4.45 గంటలకు మేలుకొలుపు, 5గంటల నుంచి 6 గంటల వరకు భగవద్గీత పారాయణం, తరువాత సాయంత్రం 6గంటల వరకు భాగవత పఠనం నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమం పూరైయేంతవరకు సంగాలపల్లె గ్రామస్తుల ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : పట్టణంలోని ఎస్వీఎస్ఆర్ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చంద్రాయుడు మనవరాలు, రామనాథ్, ప్రేమలత దంపతుల కుమార్తె వినీత వివాహం సత్యసాయి జిల్లాకు చెందిన అభినవ్‌కుమార్‌తో ఆదివారం జరిగింది. ఈ వివాహ వేడుకలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వివాహ వేడుకలకు పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని ఆశీర్వదించారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

వీరపునాయునిపల్లె : మండలంలోని అడవిచెర్లోపల్లె మాజీ సర్పంచ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సాంబశివారెడ్డి కుమారుడి వివాహ వేడుకల్లో ఆదివారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని నూతన దంపతులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మికవితలను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, అలిదెన మాజీ సర్పంచు వాసుదేవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి →



జీవనశైలిలో మనోవిజ్ఞానశాస్త్రానికి ప్రాధాన్యం

సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. లలిత



వర్కుషాపులో మాట్లాడుతున్న సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. లలిత

వైవీయూ : ప్రజల ఆరోగ్యకరమైన జీవన విధానంలో మనోవిజ్ఞానశాస్త్ర ప్రాధాన్యత ఎంతో ఉందని వైవీయూ మనోవిజ్ఞానశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె. లలిత పేర్కొన్నారు. వైవీయూ సైకాలజీ, అడ్వాన్స్‌డ్ సైకలాజికల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో 'ఆత్మహత్యల నివారణలో మానసిక నిపుణులు' అన్న అంశంపై వర్కుషాపు రెండోరోజు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షోపన్యాసం చేసిన డాక్టర్ లలిత మాట్లాడుతూ జీవితంలో వచ్చే కష్టసుఖాలు, ఎత్తుపల్లాలను సమానంగా స్వీకరించేలా పిల్లల్లో అలవాటు చేయాలన్నారు. ప్రముఖ సైకియాట్రిస్ట్ ఇండ్ల రామసుబ్బారెడ్డి వర్చువల్ విధానంలో మాట్లాడుతూ మానసిక వ్యాధులు ఉన్నవారు ఆత్మహత్యలవైపు వెళ్లడం లేదన్నారు. ఆరోగ్యంగా చలాకీగా ఉన్న వ్యక్తులే క్షణికావేశంలో ఆత్మహత్య నిర్ణయం తీసుకుని తనువు చాలిస్తున్నారన్నారు. పిల్లలకు ఇష్టమైన రంగాలను గుర్తించి, అందులోనే రాణించేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. సమగ్రశిక్ష అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభాకర్‌రెడ్డి జీవనవిధానం, ఆహారపు అలవాట్ల గురించి అవగాహన కల్పించారు. విజయవాడకు చెందిన క్లినికల్ సైకాలజిస్టు ఝాన్సీరాణి, శివగంగ మాట్లాడుతూ పిల్లల ప్రవర్తనలు, మానసిక సమస్యలు, కేస్‌స్టడీ వైద్యం తదితర అంశాలపై విశ్లేషించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మానసిక నిపుణులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సైకాలజీ అధ్యాపకులు డాక్టర్ వి. లాజరస్, డాక్టర్ బి. రవీంద్ర, డాక్టర్ ఎం. లక్ష్మినరసింహ, డాక్టర్ అశ్వర్థరెడ్డి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరాల తల్లి ఆరోగ్యమాత

కడప కల్చరల్ : మరియ తల్లి తనను అడిగిన వారందరికీ అభయహస్తం అందిస్తూ వరాల తల్లిగా కడపలో కొలువై ఉన్నారని, అందరూ ఆ తల్లిని దర్శించి కలలను సాకారం చేసుకోవాలని చిత్తూరు మల్టీ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్, రెవరండ్ ఫాదర్ గడికోట మనోహర్ తెలిపారు. కడప నగరం రైల్వేస్టేషన్ వద్ద గల ఆరోగ్యమాత చర్చి నవదిన ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ఫాదర్ సూసై నాదన్ మైఖేల్ దివ్యబలి పూజను సమర్పించగా, మనోహర్ దివ్య సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ఫాదర్‌మైఖేల్ మాట్లాడుతూ మన ఆశలకు స్పందించి అడగకముందే వరాలిచ్చే తల్లి మన సమీపంలోనే ఉందని, ఆమెను దర్శించి ఆమె దివ్య సన్నిధిలో తరించాలని సూచించారు. ఆమె వరాలిచ్చే తల్లి అని, అందుకు నిదర్శనమే ఈరోజు వందలాది మంది విశ్వాసులు తమ కృతజ్ఞతగా దివ్యబలి పూజ, కానుకలు సమర్పించారు.

క్యాంపస్ సెలక్షన్‌కు విశేష స్పందన



క్యాంపస్ సెలక్షన్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ బ్రిట్టో

పులివెందుల టౌన్ : స్థానిక లయోలా(వైఎస్ఆర్) పాలిటెక్నిక్ కళాశాలలో బెంగుళూరు జీఎన్‌డీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్‌కు విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా కళాశాలలోని కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్ బ్రాంచులకు సంబంధించిన విద్యార్థులు మొత్తం 220 మంది పాల్గొన్నారు. రిక్రూట్‌మెంట్ కోసం కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు రిటన్ టెస్ట్, యాట్యుట్యూడ్ టెస్ట్ నిర్వహించి ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇందులో కంప్యూటర్‌లో 5 మంది, ఎలక్ట్రికల్‌లో ముగ్గురు, మెకానికల్‌లో ముగ్గురిని ఎన్నుకున్నారు. ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు మరో అవకాశం కల్పిస్తామని వారు తెలిపారు. ఉద్యోగ అవకాశం పొందిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ బ్రిట్టో అభినందించారు. కార్యక్రమంలో కంపెనీ ఎండీ శివారెడ్డి, వారి బృందం, కళాశాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలగకుండా ఎన్నికలు

కడప ఎడ్యుకేషన్ : దేశ ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలగకుండా ఎన్నికలను నిర్వహించాలని, నైష్పత్తిక ప్రాతినిధ్య విధానాన్ని అమలు చేయాలని అఖిల భారత అభ్యుదయ వేదిక రాష్ట్ర నాయకులు సురేష్‌బాబు, మహబూబ్‌బాషాలు పేర్కొన్నారు. ఆదివారం కడప ఎస్టీయూ భవన్‌లో అఖిల భారత అభ్యుదయ వేదిక కడప జిల్లాశాఖ ఆధ్వర్యంలో భారత ప్రజాస్వామ్యం- జమిలి ఎన్నికలు అనే అంశంపై చర్చావేదిక జరిగింది. ఈ సందర్భంగా అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్ మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదం అయిన ఎన్నికల నిర్వహణలో అనవసరమైన ప్రయోగాలు వాంఛనీయం కాదన్నారు. దేశం అనేక సమస్యలతో కునారిల్లుతుంటే ఎన్నికల నిర్వహణ పేరిట ప్రభుత్వాలు రాజకీయ హంగామా చేయడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. 150 కోట్ల భారత ప్రజల భవిష్యత్తుతో రాజకీయ పక్షాలు ప్రయోగాలు చేయాలనుకోవడాన్ని వేదిక తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రధాన కార్యదర్శి శంకరయ్య మాట్లాడుతూ జమిలి ఎన్నికల పేరిట జా తీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీల మనుగడను ప్రశ్నా ర్థకం చేయనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పలు తీర్మానాలను చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు హైదర్‌వలీ, స్వతంత్రబాబు, అభ్యుదయ వేదిక నాయకులు పాల్గొన్నారు.

కడపలో కుండపోత వర్షం

కడప కార్పొరేషన్ : కడప నగరంలో శనివారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. శనివారం రాత్రి 7 గంటల నుంచి మొదలైన వాన ఇంతింతై భారీ వర్షంగా మారింది. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ కురిసిన వర్షంతో నగరంలోని డ్రైనేజీ కాలువలు పొంగి ప్రవహించాయి. రహదారులపై నీరు నిలిచి చెరువులను తలపించాయి. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండు ప్రాంతం, గురుకుల్ విద్యాపీఠ్, అప్సర థియేటర్, క్రిష్ణా సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, వినాయక నగర్ సర్కిల్, ఫక్కీరుపల్లె తదితర ప్రాంతాల్లో రహదారులపై భారీ ఎత్తున వర్షపునీరు నిలిచింది. మోకాలిలోతుకుపైగా నీరు నిలవడం వల్ల ద్విచక్ర వాహనాల పొగగొట్టాల్లోకి నీరు పోయి ఆగిపోయాయి. ఫలితంగా పలువురు వాహనదారులు వర్షంలో అవస్థలు పడ్డారు. లోతట్టు ప్రాంతాలైన ఎస్‌బీఐ కాలనీ, గంజికుంట కాలనీ, ఆర్‌కే నగర్, ప్రకాష్‌నగర్, ఓం శాంతినగర్, బుడగజంగం కాలనీ, రామరాజుపల్లె, అల్లూరి సీతారామరాజు నగర్, తిలక్ నగర్, శాంతినగర్, ఖలీల్‌నగర్, ఎస్‌బీఐ కాలనీ తదితర ప్రాంతాల్లో చాలా ఇళ్లు నీట మునిగాయి. నిరంతరాయంగా వర్షం కురవడం వల్ల ఉద్యోగులు, కార్మికులు, ఫుట్‌పాత్, తోపుడు బండ్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షంలోనే తడుచుకుంటూ ఇంటికి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షానికి తోడు ఈదురుగాలులు వీచడంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

తరగతులు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్ : కడప కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీటెక్ మొదటి సంవత్సరంలో చేరిన వివిధ బ్రాంచుల విద్యార్థులకు తరగతులు ఈనెల 4వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

తగ్గిన కూరగాయల ధరలు

కడప అగ్రికల్చర్ : నిన్న మొన్నటి వరకు కొండెక్కి కూర్చున్న కూరగాయల ధరలు కొండదిగొచ్చాయ్. దీంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొద్ది రోజుల నుంచి అందరి నోటా నలిగిన టమాట ధర ఒక్కసారిగా తగ్గింది. కిలో టమాట ధర రూ. 120 నుంచి ప్రస్తుతం రూ. 20కు వచ్చింది. అలాగే ఆకాశంలో ఉన్న అల్లం ధర ప్రస్తుతం కిందకొచ్చింది. గతంలో రూ. 250 ఉన్న అల్లం ధర నేడు రూ.120 కు చేరింది. కాప్సికమ్, బీన్స్ ధరలు మాత్రం కిలో రూ.60 ఉండగా, బంగాళదుంప, కాలీఫ్లవర్, అలసందలు, అనపకాయలు, ముల్లంగి, బీట్రూట్ మాత్రం కిలో రూ. 40 ఉంది. క్యారెట్ కిలో రూ.36 ఉండగా చిక్కుడుకాయలు, మిరపకాయలు కిలో రూ. 35, దొండకాయలు, క్యాబేజీ, దోసకాయలు కిలో రూ.30, బీరకాయ కిలో రూ. 25, మట్టిక్కాయ, వంకాయ, కాకరకాయలు కిలో రూ. 20, బెండకాయ కిలో రూ. 15 ఉన్నాయి.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



ప్రత్యేక అలంకరణలో అచ్చవేల్లి గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలోని బంధుమిత్రులతో విందుభోజనాలు చేశారు.

అచ్చివెల్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండలంలోని అచ్చివెల్లి గంగమ్మకు ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలి వచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కోరిన కోర్కెలు తీర్చేగంగమ్మ తల్లి అచ్చివెల్లి గంగమ్మ తల్లి ఎంతో ప్రసిద్ధి గాంచింది. అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 1993–94లో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు పలకరించుకుంటూ కుటుంబ సభ్యుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను సత్కరించారు.

ఎందరికో స్ఫూర్తినిచ్చిన సీతారామయ్య



సిద్దవటం సీతారామయ్యను సత్కరిస్తున్న శిష్యులు

కడప కల్చరల్ : జిల్లాలో స్వయం కృషితో అంచెలంచెలుగా ఎదిగి ఎందరో నిరుపేదలకు సైతం విద్యను అందుకోవడం సులభతరం చేసిన సీతారామయ్య వారందరికీ స్ఫూర్తినిచ్చారని యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళలవిభాగం హెచ్‌ఓడీ కోటా మృత్యుంజయరావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం ముందస్తు వేడుకల్లో భాగంగా ఆదివారం జిల్లాలోని సీనియర్ ఉపాధ్యాయులు సిద్దవటం సీతారామయ్యను లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి తదితరులతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మృత్యుంజయరావు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి స్వయం కృషితో ఉన్నత విద్యను అభ్యసించిన సీతారామయ్య శిష్యులు నేడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారన్నారు. ఎందరికో స్ఫూర్తినిచ్చిన ఆయన శిష్యులు కూడా వేల సంఖ్యలో నేడు తమ శిష్యులకు విద్యాబోధన చేస్తుండడం విశేషమన్నారు. లయన్ పోతుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ సీతారామయ్య వద్ద చదువుకున్న తన బిడ్డలు నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని, ఆ పుణ్యం ఆయనకే చెందాలన్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు మాట్లాడుతూ జిల్లా పర్యాటక ప్రచారాన్ని భుజానికెత్తుకోవడంతోనే నేడు జిల్లా ప్రపంచ పర్యాటక రంగంలో ఉన్నత స్థానంలో ఉందన్నారు. ఈ సందర్భంగా వారు సీతారామయ్యను సత్కరించి ఆశీస్సులు పొందారు.